28న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లో రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో, భాగ్యనగర్ కాలనీ, అర్జున్ థియేటర్ లైన్‌లోని గ్రేస్ సెక్యూరిటీ సర్వీస్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని అన్నారు.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్లు



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్‌లు తదితరులు

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నరసింహ రాజును బుధవారం బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాజా, నాయకులు మహ్మద్ బాబా, నర్రా దేవేందర్ రెడ్డి, నాగేందర్ గౌడ్, రంగంపేట్ శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రికి సన్మానం

కూకట్‌పల్లి: కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణను కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అందరు కలిసి కట్టుగా ఉండి రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బి.సంజీవరావు, కృష్ణ, రాచమల్ల శేఖర్ గౌడ్, జి. శేఖర్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని హిందూ శ్మశాన వాటికలో మౌలిక వసతులతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ సబిహా బేగం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని వి.రామారావునగర్, రాజీవ్ గాంధీ నగర్‌లలో ఉన్న హిందూ శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించాలన్నారు. చెత్తా చెదారాన్ని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీపావళి పండుగ రోజు పెద్దలకు పూజలు చేస్తారని తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

నిత్య జీవితంలో గణితశాస్త్రం అంతర్లీనం


వర్క్‌షాపులో పాల్గొన్న రెక్టార్ ప్రొ. విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణితశాస్త్ర దినోత్సవం వేడుకల్లో భాగంగా తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆర్థిక సహకారంతో క్రిప్టోగ్రఫీలో సంఖ్యా సిద్ధాంతం అనువర్తనాలు అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ ప్రొ. విజయ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణితశాస్త్రం మానవుని నిత్య జీవనంలో అంతర్లీనమైందని, సెర్చ్ ఇంజన్‌లో వేగంగా పని చేయడానికి మూలకారణమైనది గణిత శాస్త్రమని అన్నారు. అనంతరం విశిష్ట అతిథిగా హాజరైన ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. జీ.వి. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. గణితంలో మంచి పట్టు ఉన్న విద్యార్థులు మిగిలిన సబ్జెక్టులలో కూడా రాణిస్తారని, అందువల్ల బేసిక్‌లో ముఖ్యమైన గణితాన్ని సమగ్రంగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్, సి. గోవర్ధన్ గణితశాస్త్ర హెడ్ ప్రొ. ఎం.ఎస్ రాజశేఖర్ , ప్రొ. రవీంద్ర రెడ్డి, డా. శ్రీనివాస కుమార్, ప్రొ. శ్రీనివాస్, ప్రొ.రాజిరెడ్డి, డా. బి. శంకర్ గౌడ్, డా. పి.మేగరాజు, ధనలక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు తదిరులు

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కోర్సులలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బీఈడీ (డిస్టెన్స్ మోడ్) కోర్సులో డీఈఐ ఈడీ పూర్తి చేసిన ఉపాధ్యాయులు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌ను సమర్పించడానికి చివరి తేదీ అక్టోబర్ 30గా నిర్ధారించారు. వివరాలను ఈ-ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌లు వెబ్‌సైట్, అడ్మిషన్ పోర్టల్‌లో పొందవచ్చు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలి. అర్హత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎర్లీచైల్డ్ హుడ్ కేర్, ఎడ్యుకేషన్, స్కూల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ వంటి ఇతర దూరవిద్య డిప్లొమో కోర్సులలో నమోదు చేసుకోవచ్చు. ఈ కోర్సులలో ప్రవేశానికి చివరి తేదీ నవంబర్ 14 తేదీగా నిర్ణయించారు. మరిన్ని వివరాలకు విద్యార్థుల హెల్ప్‌లైన్ల కోసం 040-23008463, 040-23120600, ఎక్స్‌టెన్షన్ నంబర్ 2207 లేదా 2208లో సంప్రదించాలి.

భవన నిర్మాణాల్లో..

అక్రమాల పరంపర

- టీఎస్ బీపాస్ వచ్చినా ఆగని దందా!
- పట్టించుకోని పర్యవేక్షకులు
- చేతివాటం ప్రదర్శిస్తున్న సిబ్బంది




సాక్షి, సిటీబ్యూరో: అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం పురపాలికలు ,గ్రామ పంచాయతీల్లో కొత్తగా టీఎస్-బీపాస్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. సంబంధిత అధికారుల అలసత్వం.. పలువురి సిబ్బంది చేతి వాటంతో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఇంటి నిర్మాణాలు, స్థలాల మార్పిడి కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించకుండానే అధికారులు అనుమతులిచ్చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల సమీపంలోని ఏడు పురపాలక సంఘాల్లో విలీనమైన 28 పంచాయతీల్లోని నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు, వ్యాపార వాణిజ్య సదుపాయాలకు సంబంధించిన కట్టడాల్లో అక్రమాలకు అడ్డేలేదన్న చర్చ జరుగుతోంది. తద్వారా ఆస్తి పన్ను అసెస్‌మెంట్ లెక్కింపులో తప్పిదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 పుర పాలికల్లో జనవరి నుంచి ఇప్పటి వరకు 5,947 దరఖాస్తులు కాగా, 34 గ్రామ పంచాయతీల పరిధిలో 2.406 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

అధికారుల కనుసన్నల్లో..!

గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఉంటే దరఖాస్తులను అధికారులు తిరస్కరించేవారు. బీ పాస్ ద్వారా అన్ని దరఖాస్తులు సులువుగా పరిష్కారమవుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసెస్ మెంట్ లెక్కింపులో కొందరు అధికారులు, బిల్డర్లు తలా కొంత వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు పాటించని ఇళ్లకు కూడా కొందరు పర్యవేక్షణాధికారులు ఆమోదం తెలుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. భారీ భవనాలు, వాణిజ్య సముదాయాలకు కొలతలు తక్కువ చేసి అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. పారదర్శకత కోసం ప్రభుత్వం బీ పాస్ తెచ్చినా తెర చాటు అవినీతికి కళ్లెం పడలేక పోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో ప్రధానంగా పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట, కొంపెల్లి, దుండిగల్, దమ్మాయిగూడ, నాగారం, తూముకుంట, మేడ్చల్, జవహర్‌నగర్ పురపాలక సంఘాల్లో ఇష్టానుసారంగా అక్రమాల పరంపర కొనసాగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో టౌన్ ప్లానింగ్‌లోని పలువురు ఉద్యోగులు, సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చేతివాటం ప్రదర్శిస్తున్న పుర సిబ్బంది

పురపాలికల్లో ప్రణాళిక, రెవెన్యూ విభాగాల్లో పెద్ద ఎత్తున తప్పిదాలు దొర్లుతున్నాయి. బీపాస్ అమల్లోకి వచ్చాక అవినీతి తగ్గుతుందనుకుంటే అక్ర మార్జనలో సిబ్బంది ఆరితేరుతున్నారు. 75 నుంచి 120 గజాల్లోపు ఇళ్ల పత్రాలన్నింటినీ పరిశీలించాలి. ఈ వ్యవహారాన్ని పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఇంటి కొలతల ఆధారంగా అసెస్‌మెంట్ లెక్కింపునకు యజమానులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్ వదలాల్సి ఉంటుంది. నిర్దేశించిన కొలతల ఆధారంగా ఇళ్ల నిర్మాణాలు ఉండాలి. క్షేత్రస్థాయిలో యజమానులు అవేమీ పట్టించుకోకుండా ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షించి అక్రమాల పరంపరకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటామంటున్న కమిషనర్లు

పురపాలికల్లో అసెస్‌మెంట్ లెక్కింపులో తప్పిదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని సంబంధిత కమిషనర్లు పేర్కొంటున్నారు. బీపాస్ దరఖాస్తులను పరిశీలించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచిస్తున్నామంటున్నారు. అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతులు మంజూరు చేస్తున్నామని వివరిస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పురపాలక చట్టం ప్రకారం సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


శుభాకాంక్షలు తెలుపుతున్న దినేష్‌కుమార్, గంధం రాజు తదితరులు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కాల్వ సుజాత అన్నారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ మాజీ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి దినేష్ కుమార్, కేపీహెచ్‌బీ డివిజన్ నాయకుడు గంధం రాజు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పెంద్రు రమారెడ్డితో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో రాజేష్ యాదవ్, సుబ్బునాయుడు, దార్ల వనజ, వీణ, సుజాత, వాణి, రోజ, దుర్గా, సరోజ తదితరులు పాల్గొన్నారు.

5న ఇందిరాపార్కు ధర్నాకు కదలాలి


ధరల పట్టికను విడుదల చేస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 5న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు అధిక సంఖ్యలో తరలాలి అని సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహ అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలో కేపీహెచ్‌బీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ హాల్‌లో బుధవారం సమావేశం జరిగింది. ధరలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పోరాటం మన కోసమే కాదని, మన పిల్లల భవిష్యత్ కోసం అని కూడా అన్నారు. అదేవిధంగా ప్రతి మంగళవారం కొంతమంది షాపులు తెరుస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, మంగళవారం షాపులు తెరిస్తే రూ.5 వేల జరిమానా తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సంఘం ప్రెసిడెంట్ పన్నాటి, సెక్రటరీ వెంకటేష్, క్యాషియర్ జగన్, ఉపాధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి : సీపీఎం

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ బస్తీ హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని జోనల్ కమిషనర్‌కు బుధవారం సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్ మాట్లాడుతూ.. శ్మశాన వాటికలో విద్యుత్ స్తంభాలు వేసి వీధి లైట్లు అమర్చాలన్నారు. ప్రహరీగోడ నిర్మించాలని, సీసీ రోడ్డు వేయాలని కోరారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. అదే విధంగా మహంకాళి నగర్‌లోని రామాలయం గుడి వద్ద రోడ్డును ఆక్రమించి గుడి పేరుతో గదులను నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీను, రాములు తదితరులు పాల్గొన్నారు.


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: అర్హులైనవారు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన 27 మందికి రూ.9.68 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు అనారోగ్యంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవడానికి సీఎంఆర్ఎఫ్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్

బాలానగర్: బాలానగర్ మండలంలోని ఇంద్రనగర్ అంబేద్కర్ భవనంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ఆధ్వర్యంలో బుధవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎల్‌బీ ప్రసాద్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు సబియా మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ అని అన్నారు. కార్యక్రమంలో సోమలత, మంజుల, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలుకు చలో హైదరాబాద్

సీఐటీయూ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి


మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

దుండిగల్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ దుండిగల్ గండి మైసమ్మ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ మేనేజర్ సునందకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పోరాటంలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు నరసింహ, సురేందర్, ఎల్లయ్య, క్రాంతి, విజయ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో సత్తా చాటిన పూజ



మియాపూర్: రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో కెనరి ద స్కూల్‌కు చెందిన పూజ కరికేటి సత్తా చాటారు. అక్టోబర్ 5 నుండి 8వ తేదీ వరకు జరిగిన 62వ రోలర్ స్కేటింగ్ నేషనల్స్‌లో 9-11 బాలికల విభాగంలో పూజ 7పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు విద్యార్థిని పూజని పాఠశాల చైర్‌పర్సన్ శ్వేతా రెడ్డి, ప్రిన్సిపాల్ లిడియా క్రిస్టీనా, స్కూల్ హెడ్ సీనియర్ నవీన్‌కుమార్, కో ఆర్డినేటర్లు అభినందించారు.

సదుపాయాల కల్పనలో విఫలం


టౌన్‌ప్లానింగ్ ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడంలో పాలక మండలి విఫలమైందని బీజేపీ నిజాంపేట్ అధ్యక్షుడు భిక్షపతియాదవ్ అన్నారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ జ్యోత్స్న, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ సత్యనారాయణలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పాలకమండలి పదవి ముగియనున్న సందర్భంగా స్థానిక సమస్యలను పట్టించుకోవడం లేదని, కమిషనర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో పరిపాలన పడకేసిందన్నారు. రోడ్లపై గుంతలు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, దాసి నాగరాజు, సంతోష్, సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా బురద.. వెళ్లేది ఎలా?

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రధాన రోడ్డు అధ్వాన్న స్థితికి చేరింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు దెబ్బ తినడంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ విషయమై గతంలో 'సాక్షి'లో కథనాలు ప్రచురితం చేయగా.. సంబంధిత అధికారులు అప్పటికప్పుడు తాత్కాలికంగా ప్యాచ్ వర్క్ చేసి చేతులు దులుపుకున్నారు. మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.



పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



సాక్షి,సిటీబ్యూరో: నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పథకాన్ని ప్రవేశపెట్టి, ఎంతో మంది విద్యార్థులకు ఎంతో మేలు చేయగా, నేడు అధికారంలో ఉన్న అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో మేడ్చల్ కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా విద్యా రంగంలో పేరుకుపోయిన సమస్యలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ నిధులు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. గత మూడు సంవత్సరాల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు ఆయా కళాశాలల యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో వారు ఉన్నత చదువులు, ఉద్యోగాలకు వెళ్లలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నెల 27 వరకు నిధులు విడుదల చేయని పక్షంలో వేలాది మంది విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధన కార్యక్రమాన్ని చేపడుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీనికి ముందు విద్యార్థులు కలెక్టరేట్ వద్ద బైఠాయించటంతో పాటు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు రెహమాన్, చిన్న, ఎండీ అన్వర్, హరీష్, అరవింద్, శశిధర్, మహేష్, వందలాది మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లింక్ రోడ్ల సమస్యలను పరిష్కరించండి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

అల్విన్‌కాలనీ: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, లింక్‌రోడ్ల సమస్యలను పరిష్కరించాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కోరారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని రోడ్లు, లింక్ రోడ్లకు, రోడ్ల విస్తరణ పనులకు ఎటువంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ రహిత సమాజం కోసం మరిన్ని లింక్ రోడ్లు ఏర్పాటు చేయాలని, స్థల సేకరణ జరిగి పెండింగ్‌లో ఉన్న లింక్ రోడ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. వెంటనే పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని చీఫ్ సిటీ ప్లానర్ తెలిపారన్నారు. అదే విధంగా సకాలంలో రోడ్లు, లింక్ రోడ్లు, మిగిలిన నాలా విస్తరణ పనులు పూర్తి అయ్యేలా చూస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

పేదలకు ఆర్థిక భరోసా

అల్విన్‌కాలనీ: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసాను ప్రభుత్వం కల్పిస్తుందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. విడుదలైన రూ.1.20 లక్షల విలువ గల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీనివాస్, పోతుల రాజేందర్, ఎండీ ఇబ్రహీం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలపై చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు